
ప్రభాత జయభేరి
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రజల పక్షాన అక్ష...
సంపుటి : 01
సంచిక : 119
పేజీలు : 6
వెల : 4
మల్కాజిగిరి
గురువారం, 16-11-2023






# విరాట్ విశ్వరూపం.. సచిన్ రికార్డు బ్రేక్..

సచిన్ రికార్డులను బ్రేక్ చేయడం సాధ్యమా..? బ్రేక్ సంగతి పక్కనబెట్టి కనీసం ఆ దరిదాపుల్లోకి అయినా ఎవరైనా వస్తారా..? అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ విరాట్ కోహ్లీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక వాంఖడే స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న సెమీఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీ.. తాను ఎంతగానో ఆరాధించే సచిన్ టెండూల్కర్ ఎదుటే అతడి రికార్డును బ్రేక్ చేశాడు. వన్డేలలో సచిన్ పేరిట ఉన్న 49 శతకాల రికార్డు (వన్డేలలో) ను ఇటీవలే సమం చేసిన విరాట్.. నేడు మాస్టర్ బ్లాస్టర్ ఎదురుగానే ఆ రికార్డును తుడిచేసి 50వ శతకాన్ని నమోదుచేశాడు. కోహ్లీ.. ఒక్కో పరుగు కూడగడుతూ 59 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. అనంతరం దూకుడు పెంచాడు. సౌథీ వేసిన 30వ ఓవర్లో సిక్సర్ బాదిన విరాట్.. తర్వాత బౌల్ట్, ఫిలిప్స్, సౌథీలు వేసిన ఓవర్లలో ఫోర్లు కొట్టాడు. బౌల్డ్ వేసిన 36వ ఓవర్లో మరో ఫోర్ కొట్టి సెంచరీకి చేరువయ్యాడు. 90లలోకి వచ్చాక కాస్త నెమ్మదించిన కోహ్లీ.. ఫెర్గూసన్ వేసిన 42వ ఓవర్లో డబుల్ తీసి 50వ శతకాన్ని పూర్తిచేశాడు. వన్డే క్రికెట్‌లో సచిన్.. 462 ఇన్నింగ్స్‌లలో 49 సెంచరీలు చేయగా కోహ్లీ మాత్రం 279 ఇన్నింగ్స్‌లలోనే సెంచరీల అర్ధసెంచరీలు చేయడం గమనార్హం.



# కేసీఆర్ కు రేవంత్ సవాల్

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15:

తెలంగాణ సీఎం కేసీఆర్కు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. కరెంటుపై చర్చకు తాను సిద్ధమని లాగ్ బుక్లతో కేసీఆర్ రావాలంటూ ఛాలెంజ్ విసిరారు. ఇద్దరూ పోటీ చేస్తున్న కామారెడ్డి చౌరాస్తాలోనే చర్చిద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కచ్చితంగా పూర్తి స్థాయిలో 24 గంటల పాటు కరెంటు ఇస్తామని హామీ ఇచ్చారాయన.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం విద్యుత్ చుట్టూనే తిరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో దీన్నే ప్రధాన అంశంగా చేసుకొని బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. గతంలో తెలంగాణ పీసీసీ చీఫ్ చేసిన కామెంట్స్ను చూపిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. దీనిపై కాంగ్రెస్ నేతలు కూడా గట్టిగానే కౌంటర్ అటాక్ చేస్తున్నారు. జోరుగా నియోజకవర్గాలను చుట్టేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్తోపాటు మిగతా బడా నేతలంతా కాంగ్రెస్ను టార్గెట్ చేస్తున్నారు. ప్రతి సభలో కరెంటు కావాలా కాంగ్రెస్ కావాలా అంటూ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నారు. గతంలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితోపాటు కర్ణాటకలో కాంగ్రెస్ నేతలు చేసిన కామెంట్స్ను ఉదాహరణగా చూపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ చీకట్లు ఖాయమంటూ భయపెడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ పాలన గుర్తుకు తెచ్చుకోవాలంటూ వార్నింగ్ ఇస్తున్నారు. ఈ విమర్శలను ఎప్పటికప్పుడు కాంగ్రెస్ నేతలు తిప్పికొడుతున్నారు. అందులో భాగంగానే మిగతా 2 లో

# 29, 30 తేదీల్లో సెలవులు




జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15:

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో.. పోలింగ్ తేదీ(నవంబర్ 30)తోపాటు, ముందురోజు (నవంబరు 29) కూడా ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మొత్తం 1.06 లక్షల మంది ఉపాధ్యాయుల్లో.. 80 శాతం మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. అయితే పోలింగ్ కేంద్రాలుగా ఉండే ప్రభుత్వ పాఠశాలలకు సిబ్బంది ఒకరోజు ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. నవంబర్ 29న ఉదయం 7 గంటలలోపే ఈవీఎంలను తీసుకునేందుకు ఉపాధ్యాయులు నిర్ణీత కేంద్రంలో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల నవంబర్ 29, 30 తేదీల్లో ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సిందే. పోలింగ్ జరిగే ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ఇచ్చే విషయాన్ని ఎన్నికల కమిషన్ సూచన మేరకు అధికారంగా ప్రకటించనున్నారు.నవంబరు 29 నుంచి ఎన్నికల విధుల్లో ఉండే ఉపాధ్యాయులు.. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను తీసుకొని ఆయా కేంద్రాలకు వెళ్లి సమర్పించి వచ్చే సరికి అర్ధరాత్రి దాటుతుందని, అందువల్ల విధుల్లో పాల్గొన్న వారికి డిసెంబరు 1న కూడా సెలవు ఇవ్వాలని రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు ఎన్నికల సంఘాన్ని కోరారు.తెలంగాణలో ఎన్నికలు ఇంకొద్ది రోజులే ఉన్నందున ముఖ్యమైన తాయిలాల్లో ఒకటైన మద్యం పంపకాలపై ఎన్నికల సంఘం ఫోకస్ చేసింది. తాజాగా ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రకారం తెలంగాణలోని 18 మద్యం డిస్టిలరీలపై నిఘా పెట్టినట్లుగా మిగతా 2 లో

## జయభేరి అక్షర తూటా




మొత్తానికి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది..

అసమ్మతి రెబల్ నేతలను బుజ్జగించిన
ఆయా రాజకీయ పార్టీలు..
వారం రోజులే ప్రచారానికి గడువు...

గెలుపు మాదే అంటే మాదే అంటున్న..
అయ్యా సార్లు...
ఒక్క మాట వినండి గత ఎన్నికల్లో
నోటా కే ఎక్కువ ఓట్లు పడ్డాయి...

ఈసారి 2వ స్థానంలో నిలుస్తుందో...
మొదటి స్థానంలో వస్తుందో... జాగ్రత్త సుమీ..
అసలే నిరసన సెగలు పెల్లుబుకుతున్నాయి..
ఏమో చెప్పాలనిపించింది చెప్పాను.. ఇక మీ ఇష్టం.. ?

...కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

మీ మాటల తూటాలను మాకు పంపండి...
మా 'జయభేరి అక్షర తుటా' తో జతవుతుంది.
+91 9391 544 889

# ఫలించిన బుజ్జగింపులు



జయభేరి, నల్గొండ, నవంబర్ 15 :

సూర్యాపేటలో పటేల్ రమేష్ రెడ్డి నివాసం దగ్గర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ ఉపసంహణకు గడువు సమీపిస్తుండటంతో రమేష్ రెడ్డిని బుజ్జగించేందుకు మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి ఆయన ఇంటికి వెళ్లారు. రమేష్తో మాట్లాడిన అనంతరం బయటకు వచ్చిన మల్లురవితో పటేల్ అనుచరులు వాగ్వాదానికి దిగారు. ఓ దశలో సహనం కోల్పోయి దాడి చేసేందుకు యత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.పరిస్థితి చేజారుతుండటంతో అలర్టయిన పోలీసులు పటేల్ అనుచరులను అడ్డుకున్నారు. రమేష్ రెడ్డితో అన్ని విషయాలు మాట్లాడామని.. ఎంపీగా అవకాశం కల్పిస్తామన్న అధిష్టానం ఆదేశాలను రమేష్కు వివరించామన్నారు మల్లు రవి.ఓ వైపు బుజ్జగింపులు.. మరోవైపు అనుచరుల ఆందోళనల మధ్య..నామినేషన్ను ఉపసంహరించుకున్నారు రమేష్ రెడ్డి. కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానని మిగతా 2 లో



# రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే హవా

జాతీయ పార్టీల హవా ఉండదు : ముఖ్యమంత్రి కేసీఆర్


జయభేరి, నిజామాబాద్, నవంబర్ 15

రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే హవా ఉంటుంది.. ఈ జాతీయ పార్టీల హవా ఉండదు అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. 2024 తర్వాత దేశంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే.. ఏక పార్టీ ప్రభుత్వం రాదు. అన్ని ఎంపీలు మనం గెలుచుకుంటే బీఆర్ఎస్ తడాఖా అప్పుడు ఢిల్లీలో చూపెడుదాం అని కేసీఆర్ చెప్పారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నాం. హిందూ, ముస్లిం, క్రైస్తవుల అనే తేడా లేకుండా అన్ని మతాల ప్రజలను కలుపుకొని పోతున్నాం. అందర్నీ సమానంగా ఆదరిస్తున్నాం. ప్రతి స్కీంలో అందరూ భాగస్వామ్యం అవుతున్నాం. అన్ని మతాల వారిని సమానంగా చూస్తున్నాం. తెలంగాణ కల్చర్ గంగా జమునా తెహజీబ్. హిందూ, ముస్లింలు అందరూ సోదరుల్లా కలిసి ఉండి మొత్తం ప్రపంచానికి ఉదాహరణగా ఉంటున్నాం. పదేండ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కర్ఫ్యూ లేదు, కల్లోలం లేదు. బ్రహ్మాండంగా శాంతియుతంగా ముందుకు పోతున్నాం. లా అండ్ ఆర్డర్ పటిష్టంగా మెయింటెన్ చేస్తున్నాం. రాష్ట్రాన్ని అద్భుతంగా ముందుకు తీసుకుపోతున్నాం.. బీఆర్ఎస్ ముమ్మాటికి సెక్యులర్ పార్టీ అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**బీజేపీ మతపిచ్చితోని మంటలు పెట్టే పార్టీ..**


బీజేపీ మతపిచ్చితోని మంటలు పెట్టే పార్టీ. మాట మాటకు మతం పిచ్చి మాటలు. ప్రజలను డివైడ్ చేయడం వంటి పనులు మిగతా 2 లో

# చంద్రబాబుకు గుండె సమస్య



జయభేరి, విజయవాడ, నవంబర్ 15 :

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు గుండె సమస్య ఉన్నట్లు తేలింది. చంద్ర బాబు కంటి ఆపరేషన్, హెల్త్ కండిషన్ వివరాలను హైకోర్టుకు ఆయన లాయర్లు సమర్పించారు. 'చంద్రబాబు కుడి కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. చంద్రబాబు నాయుడు గుండె పరిమాణం పెరిగింది. గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో సమస్యలు ఉన్నాయి. తగిన విశ్రాంతి తీసుకోవాలి. మధుమేహం అదుపులో ఉంచి జాగ్రత్తలు పాటించాలి' అని వైద్యులు చెప్పారని చంద్రబాబు లాయర్లు కోర్టుకు వివరించారు. కాగా 15 రోజుల కిందట చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన మిగతా 2 లో



# రాజ్ భవన్ పై పెట్రోల్ బాంబు దాడి

జయభేరి, చెన్నై, నవంబర్ 15 :

తమిళనాడు గవర్నర్ బంగళా (రాజ్ భవన్)పై పెట్రోల్ బాంబు దాడి ఘటనపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇప్పటిదాకా పోలీసులు జరిపిన విచారణలో అసలు నిజాలు వెల్లడి కాలేదని బీజేపీ నేతలు అసంతృప్తి వ్యక్తంచేశారు. తాజాగా కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (NIA)కు అప్పజెపుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ కేసును ఇకపై NIA విచారించనుంది. దాడి వెనుక ఉగ్రవాదుల హస్తం ఉందన్న అనుమానాల నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.తమిళనాడులో పెట్రోల్ బాంబు దాడులు తరచూ జరుగుతుంటాయి. ఎక్కువగా హిందూ సంఘాల నేతలు, బీజేపీ నేతలు ఇళ్లపైనే ఇలా పెట్రోల్ బాంబులతో దాడులు చేసిన ఘటనలు అనేకం మిగతా 2 లో



# బిఎల్ఆర్ కు వీర తిలకం

3 లో

## త్యాగాల పునాదుల మీద ఏ జెండా ఎగరేద్దాం..!

2 లో

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేసీఆర్ కు రేవంత్ సవాల్

కేసీఆర్కు రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. 24గంటల ఉచిత విద్యుత్ పై కామారెడ్డి చౌరస్తాలో చర్చిద్దాం రమ్మని పిలుపునిచ్చారు. 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు నిరూపిస్తే అటు కొడంగల్లో ఇటు కామారెడ్డిలో నామినేషన్ ఉపసంహరించుకుంటానంటూ ఛాలెంజ్ చేశారు. సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ ఉపసంహరణకు టైం ఉందని ఈ లోపు కేసీఆర్ లాగ్ బుక్లతో రవాలాని అన్నారు.

**కాంగ్రెస్ వస్తే 4016 పెన్షన్**

కేసీఆర్ ఉంటే 2వేలు పెన్షన్.. కాంగ్రెస్ వస్తే 4వేలు పెన్షన్ అని టీపీసీసీ రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ లో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బలరాం నాయక్ ఎమ్మెల్యే టికెట్ ను త్యాగం చేసారని అన్నారు. బోథ్ కాంగ్రెస్ టికెట్ రాని వన్నెల అశోక్ నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. 10 ఏళ్లలో ఆదిలాబాద్, పాలమూరు ఏం మారలేదన్నారు. గూడెంలు, తండాల్లో స్కూల్ లు లేవన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో బోథ్ కు నీరు ఎందుకు రాలేదు? అని ప్రశ్నించారు. ప్రసవం కోసం నరకం చూడాల్సిన పరిస్తితి ఎందుకు వచ్చింది? అని మండిపడ్డారు. సర్పంచ్ లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించడం లేదన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టినప్పటికి.. దద్దమ్మ దయాకర్ రావ్ ఖాళీ సీసాలు అమ్ముకుంటున్నారని అంటున్నారని తెలిపారు. అన్నారం అయిపోయింది.. మేడిగడ్డ కుంగిందన్నారు. ఇసుక మీద లక్ష కోట్ల పెట్టి ప్రాజెక్టు కట్టారని మండిపడ్డారు. ఇలా కడితే ఎలా? అని ప్రశ్నించారు. కేసీఅర్ అవినీతికి మెడిగడ్డ బలైందన్నారు. బోథ్ కు నీళ్ళు రాక పోవడంకు కారణం సీఎం కేసీఆర్ అన్నారు.కుప్టి ప్రాజెక్టు పూర్తి కావాలంటే డిగ్రీ కాలేజీ రావాలంటే కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలన్నారు. డిసెంబర్ 31 లోపు డిగ్రీ కాలేజీ, కుప్టి ప్రాజెక్టు పనులు ప్రారంబిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ అయితాయన్నారు. 2004లో ఇచ్చిన గ్యారంటీ నిలబెట్టిన వీరవనిత సోనియా తెలంగాణ ఇచ్చిందని తెలిపారు. 6గ్యారంటీ లను ప్రకటించడంతో సీఎం ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి అందరిని కలుస్తున్నారని అన్నారు. హోం మంత్రిని సైతం ప్రగతి భవనకు రానియ్యలేదని మండిపడ్డారు. ఎత్తి పోతల పథకంలో బిజీగా ఉన్నాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులను కలవనియ్యక పోయేదన్నారు. పొన్నాల లక్ష్మయ్య భాద పడుతుంటే మాత్రం ఉరికిండని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు అనాడు ఇచ్చామన్నారు. డబుల్ బెడ్రూం ఎవ్వరికైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం కట్టిన ఊరులో మేము ఒట్లు అడగామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఊరులో మేము ఓట్లు అడుగుతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు హనుమాన్ గుడి లేని గ్రామం తెలంగాణలో లేదన్నారు. కేసీఅర్ ఉంటే 2వేలు పెన్షన్ కాంగ్రెస్ వస్తే 4వేల పెన్షన్ వస్తుందని తెలిపారు.

## రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే హవా

చేస్తోంది. బీజేపీ మనకు ఎంత మోసం చేసిందంటే.. దేశ వ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. 100 ఉత్తరాలు రాశాను కానీ ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. నవోదయ పాఠశాలలు ఇవ్వలేదు. జిల్లాకో నవోదయ పాఠశాల ఉండాలన్న చట్టాన్ని ఉల్లంఘించారు మోదీ. వంద సార్లు అడిగాను. ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వలేదు. బావుల కాడ మోటర్లకు మీటర్లు పెట్టాలని చెప్పరు.. నేను పెట్టలేదు. ఇందుకు ఐదేండ్లకు రూ. 25 వేల కోట్లు కట్ చేశారు. బడ్జెట్ కట్ చేసి, నవోదయ, మెడికల్ కాలేజీ ఇవ్వని బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి. ఇవన్నీ ఆలోచించాలి. ఆలోచించి ఓటు వేయాలి. ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వని బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయొద్దు. ఈ విషయాలపై బీజేపీ నాయకులను నిలదీసి అడగండి. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు లాభం చేయలేదు.. నష్టం చేశాయి. తెలంగాణను కాంగ్రెస్ ముంచితే, బీజేపీ పదేండ్ల నుంచి కృష్ణాలో మన వాటా తేల్చదు. డబ్బులు రానివ్వదు. ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వదు.. ఇలా చాలా ఇబ్బంది పెడుతుంది అని కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 29, 30 తేదీల్లో సెలవులు

ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ సురేశ్ తెలిపారు. ఇందుకోసం మొత్తం 10 టీమ్ లను ఏర్పాటు చేసి.. ఒక్కో టీమ్ కి ఎక్సైజ్ సూపరింటెండెంట్ను ఇన్చార్జిగా నియమించినట్లు సురేశ్ తెలిపారు. రాష్ట్రంలోని 18 డిస్టిలరీలను అధికారుల టీమ్స్ ఆకస్మికంగా తనిఖీ చేశాయని, లిక్కర్ ఉత్పత్తి, సప్లై, సంబంధింత రిజిస్టర్లను పరిశీలించినట్లు చెప్పారు. రికార్డులన్నీ సక్రమంగాగానే ఉన్నాయని, అధికారుల పరిశీలనలో తేలిందని సురేశ్ వెల్లడించారు. మద్యం డిస్టిలరీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎక్సైజ్ శాఖ హెడ్ ఆఫీస్ కు కనెక్ట్ చేసినట్లుగా ఆయన వెల్లడించారు. నిరంతరం సీసీటీవీ కెమెరాలను పరిశీలించడం సహా.. మద్యం అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టినట్లుగా జాయింట్ కమిషనర్ సురేశ్ వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీకి నవంబర్ 30వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తుది ఓటర్ల జాబితా విడుదలైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 15 నియోజకవర్గాలు ఉండగా.. ఇక్కడ మొత్తం 45,36,852 మంది (43 లక్షల 36 వేల 8 వందల 52 మంది) ఓటర్లు ఉన్నారని ఎన్నికల అధికారులు తెలిపారు. తాజా ఓటర్ల జాబితాలో 77,522 మంది (77 వేల 5 వందల 22 మంది) కొత్త ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఎన్నికల అధికారులు వెల్లడించిన తుది జాబితా ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం ఓటర్లలో పురుష ఓటర్లు 23,22,623 మంది ఉండగా, మహిళా ఓటర్లు 22,13,902 మంది ఉన్నారు. దివ్యాంగ ఓటర్లు 20,207 మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు 883 మంది, సర్వీస్ ఓటర్లు 404, ట్రాన్స్జెండర్ ఓటర్లు 327 మంది, 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 80,037 మంది ఉన్నారు

## రాజ్ భవన్ పై పెట్రోల్ బాంబు దాడి

వెలుగు చూశాయి. కోయంబత్తూరు, మధురై ప్రాంతాల్లో ఈ బాంబు దాడుల సంస్కృతి ఎక్కువగా ఉంటుంది. మిగిలిన చోట్ల అరుదుగా ఇలాంటి ఘటనలు జరుగుతుంటాయి. అయితే అక్టోబర్ 25న చెన్నైలో తమిళనాడు గవర్నర్ నివాసం ఉండే రాజ్ భవన్ పై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబుతో దాడి చేశారు. రాజ్ భవన్ మెయిన్ గేట్ వద్దనున్న పోలీస్ బ్యారికేడ్లపై బాంబులు పడ్డాయి. అక్కడున్న సిబ్బందికి ఎలాంటి అపాయం జరగలేదు. కానీ మెయిన్ గేట్ ఆర్చి దెబ్బతింది. ఘటనపై రాజ్ భవన్ సెక్రెటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ పుటేజీ ఆధారంగా పాత నేరస్తుడు, గూండా చట్టం కింద అరెస్టై బెయిల్ పై వచ్చిన కరుక్క వినోద్ పనిగా పోలీసులు నిర్ధారించారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తీసుకుని విచారించారు. వినోద్ గతంలో చెన్నైలోని బిజెపి పార్టీ ప్రధాన కార్యాలయం, తేనామ్ పేట పోలీస్ స్టేషన్, ప్రభుత్వ మద్యం దుకాణం పైనా బాంబు దాడులు చేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. అనేక కేసుల్లో నిందితుడుగా ఉన్న వినోద్ పై గూండా యాక్ట్ నమోదు చేశారు. అయితే బెయిల్ పై వచ్చిన వెంటనే ఇలా ఏకంగా రాజ్ భవన్ పైనే అటాక్ చేయడం సంచలనం సృష్టించింది.

## చంద్రబాబుకు గుండె సమస్య

విషయం తెలిసిందే. జైలు నుంచి విడుదలైన తర్వాత కంటి ఆపరేషన్ చేయించుకున్న చంద్రబాబు- - -ప్రస్తుతం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. మరో వైపు.. స్కిల్స్కాం కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా పడింది. విచారణను ఏపీ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. రేపు మధ్యాహ్నం 2.15గంటలకి తిరిగి విచారణ చేపట్టనున్నట్లు ఏపీ హైకోర్టు తెలిపింది. ఇవాళ హైకోర్టులో సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించగా.. మరో వైపు చంద్రబాబు కంటి ఆపరేషన్, ఆరోగ్య పరిస్థితి వివరాలను ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టుకు సమర్పించారు. వైద్యుల సూచనల మేరకు నివేదికను మెమో ద్వారా కోర్టుకు అందించారుచంద్రబాబు రెగ్యులర్ బెయిల్ పిటిషన్పై బుధవారం ఉదయం హైకోర్టు విచారణ చేపట్టగా.. సీఐడీ తరఫు న్యాయవాదులు పాస్ ఓవర్ అడిగారు. అదనపు అఫిడవిట్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. దీంతో హైకోర్టు విచారణను మధ్యాహ్నం 12.15లకు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. సీఐడీ తరఫు న్యాయవాది ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి అదనపు చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ చార్జిషీట్పై పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇదే సమయంలో చంద్రబాబు నాయుడు తరపు న్యాయవాది ఆయన హెల్త్ నివేదికన మెమో రూపంలో కోర్టుకు అందజేశారు. సమయం అయిపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. సీఐడీ హైకోర్టులో అదనపు అఫడవిట్ లో తెలుగుదేశం పార్టీ ఖాతాలకు సంబంధించి వివరాలు కోరామని తెలిపింది. ఈ మేరకు ఇప్పటికే టీడీపీ కార్యదర్శికి నోటీసులు అందజేసినట్లు తెలిపింది. పార్టీల ఖాతాల వివరాలు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. పార్టీ బ్యాంక్ ఖాతాల వివరాలు ఇవ్వాలని కోరుతూ కార్యాలయ కార్యదర్శి అశోక్బాబుకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఈనెల 18లోగా వివరాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నట్లు చెప్పారు.

# త్యాగాల పునాదుల మీద ఏ జెండా ఎగరేదాం..!

**తెలంగాణ రాష్ట్రం పోరాటాల పురిగడ్డ మీద పురుడు పోసుకుంది... సబండ వర్గాలు సబండ కులాలు సబండ జాతులు ఏకమై కలిసి గొంతే పోరు చేస్తే తెలంగాణ వచ్చింది.. 69 ఉద్యమం మొదలుకొని మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించింది విద్యార్థులు సామాజిక వాదులు... మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్ ఉద్యమాన్ని ముందు నడపడానికి ఎందరిని వాడుకున్నారు.. ఎందరినో పక్కకు నెట్టేశారు.**




✍ **జయభేరి, హైదరాబాద్ :**

ఎన్నో అవమానాలు ఎన్నో చీత్కారాలు ఏమైనా సరే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ఢిల్లీ మెడలు ఉంచడానికి ఆనాడు ఉద్యమాన్ని చేపట్టారు... డిసెంబర్ 9 నాడు ప్రకటన చేసిన తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోజే రాష్ట్ర కల సహకారం అయ్యేది కానీ కొంత రాజకీయాన్ని చేసిన రాజకీయ నాయకులు దాన్ని జూన్ వరకు పొడిగించుకొని వచ్చారు... ఎందుకు ఇదంతా మనందరికీ తెలుస్తుందే కదా అని అనుకోవచ్చు...

**కానీ త్యాగాల పునాదుల మీద ఇవ్వాలా ఏ జెండాను ఎగరేయాలి అని ప్రజలు ఆలోచిస్తున్నారు... ఉద్యమ పార్టీగా ఏర్పడిన తెలంగాణ పార్టీ భారత రాష్ట్ర సమితిగా ఏర్పాటైన తర్వాత ఉద్యమ ఆకాంక్షను మరిచిందా!? బంగారు తెలంగాణ సాధ్యమైందా!? తెలంగాణ ప్రజలకు సంక్షేమ పథకాలు ఉచిత హామీలు ఇవన్నీ అవసరమా!? అన్న ప్రశ్నలకు సామాజిక న్యాయవాదులు సామాజిక ఉద్యమకారులు శసేమిరా దీన్ని జీర్ణించుకోవడం లేదు.. ఎందుకంటే 2014లో రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఉద్యమానికి సారధి వహించిన కేసీఆర్కు రాష్ట్రాన్ని అప్పజెప్పిన ప్రజలు రెండవసారి కూడా 2018లో అధికారాన్ని కట్టబెట్టారు.. 9:30ళ్లలో తెలంగాణ రాష్ట్రం అతలా కుతలం అయిపోయి అప్పుల భారంగా మారిపోయింది...**

కాలేశ్వర ప్రాజెక్టు యొక్క కహానీలు అందులో జరిగిన అవినీతి ఒక వ్యక్తి అయితే తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాల్లో ఆయా ఎమ్మెల్యేల అవినీతి చిట్టా విప్పితే కంపు కొడుతుంది... రైతులకు రైతుబంధు బీసీలకు బీసీ బందు ఆత్మగౌరవ భవనాలు స్మశాన వాటికలు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఆసరా పింఛన్లు ఇలా ఎన్నో పథకాలు పెట్టినా రాష్ట్ర సమితి విద్యార్థి ఉద్యమ నాయకులను పక్కన పెట్టేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఇవ్వడాన్ని మరిచిపోయి విద్య వ్యవస్థను పతనం చేసే దిశగా ముందుకు పోయింది... గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణ జిల్లాలోని ప్రతి ఒక్క ఊరికి బస్సు వచ్చేది కానీ ఈరోజు ఆ బస్సు కూడా కరువైపోయింది..

**తెలంగాణ రాష్ట్రానికి పెద్ద కొడుకుగా.. పెద్దన్నగా.. తండ్రిగా బాధ్యత వహించాల్సిన కేసిఆర్ అప్పనంగా ట్రిబుల్ వన్ జీవోను ఎత్తేసి పూర్తిగా నగరం చుట్టుముట్టు భూములన్ని అధికార పార్టీ నాయకులచే కొనుగోలు చేసిన సంగతి మనందరికీ తెలిసిందే... మిషన్ కాకతీయ పేరుతో ప్రతి గ్రామంలోని చెరువులను పూడిక తీస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చెరువులను కబ్జా చేసింది అనే ఆరోపణలు కూడా ఎదుర్కొంది... హరితవనం పేరుతో మొక్కల పెంపకం పేరుతో సాదసీద పేద రైతుల దగ్గర ఉన్న భూమిని లాగేసుకొని పూర్తిగా హరితవనం పేరుతో మొక్కలు నాటిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుంది.. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో ఎవరు ఎవరికి ఇవ్వాలి!? ఎవరు ఎవరికి బిక్ష పెట్టింది!? అభివృద్ధికి నోచుకున్న తెలంగాణ ప్రభుత్వం దాని వెనుక అవినీతి గోతులు తీసిన సంగతి చరిత్ర మరిచిపోతుందా!?**

తెలంగాణ ఉద్యమంలో నాడు తెలంగాణ నై అన్న వ్యక్తులే ఇవ్వాలా క్యాబినెట్ పదవులలో తురతువుతుంటే ప్రజలు ఎలా జర్నించుకుంటారు.. రాజకీయ లబ్ధి కోసమే అందరిని ఆయా పార్టీల నుంచి రాజీనామా చేసి తన పార్టీలో కలుపుకున్న అధికార పార్టీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీ లేకుండా చేస్తే అది ప్రజాస్వామ్యం ఎలా అనబడుతుంది!? పెన్షన్లు ఇస్తున్నాం సంక్షేమ పథకాలు ఇస్తున్నాం అని చెప్పుకునే ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి వచ్చిందా లేకపోతే వరాలు గుప్పించడానికి వచ్చిందా!? ఇదే ఇప్పుడు అసలైన ప్రశ్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పునాదుల మీద ఏర్పడి పోరాటాల ద్వారా సాధించుకొని ఆత్మ బలిదానాల ఫలితమే రాష్ట్రంగా ఏర్పడ్డాయి రాష్ట్రంలో ఏ ఏ కుటుంబాలు బాగుపడ్డాయో మనందరికీ తెలుసు...

**కాంగ్రెస్ ఏం చేసింది అని పదేపదే కాంగ్రెస్ను 60 సంవత్సరాల రాజకీయ ప్రస్తానాన్ని తప్పు పట్టే ఈ నాయకులు కాంగ్రెస్ ఏం చేసిందో గుండెల మీద చేయి వేసుకొని చెప్పగలరా!? కాంగ్రెస్ చేయకపోతే ఈరోజున తెలంగాణ రాష్ట్రం ఏర్పాట అయ్యేదా? రాష్ట్రం సాధించుకోవడానికి బిజెపి తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకు వచ్చిన తర్వాత దేశంలో అనేక రాజకీయ పార్టీలు మద్దతు పలికిన తరువాతనే కదా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయింది... తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత విద్యార్థుల భవిత బంగారు బాటవుతుంది అని అనుకొని ఆశపడి చదువుకున్న రాష్ట్ర నిరుపేద యువత ఇవ్వాలా మద్యానికి బానిసలు అవుతుంటే త్యాగాల పునాదుల మీద యువత మద్యానికి బలైపోతుంటే ఎవరు మాట్లాడాలి? ఎవరు గర్జించాలి? ఎవరు నిలదీయాలి? నమ్మించి నయవంచన చేసి మోసం చేసిన వారెవరు? రాష్ట్రానికి దళితుడే ముఖ్యమంత్రి అని చెప్పిన నాటి చంద్రశేఖర రావు దళితుల్లో ముఖ్యమంత్రులుగా నియమించడానికి నాయకులు లేరా అంటే ఆ ప్రశ్నకు సమాధానం ఉండదు!**

జై తెలంగాణ అని ఉద్యమించిన నాయకులకు తెలంగాణ పార్టీ అంటే ఓన్లీ భారత రాష్ట్ర సమితి కనిపిస్తుందా మిగతా రాజకీయ పార్టీలు కనపడవా అన్న ప్రశ్న సమాధానానికి దూరం అవుతూనే ఉంది.. ఉద్యమ నినాదాన్ని రాను రాను భ్రష్టు పట్టిపోతున్న ఈ తరుణంలో మార్పు కోసం తెలంగాణ ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఇదే... తెలంగాణ ప్రజలు కోరుకున్నది ఏంటో మరొక్కసారి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ రెండు రాష్ట్రాల్లో కనుమరుగైన నేడు మరొక్కసారి తన గొంతును వినిపిస్తోంది...

**కాళోజీ నారాయణరావు అన్నమాట ఇప్పుడు గుర్తొస్తుంది పరాయి వాడైతే తన్ని తరిమి మన ఇంటి వాడైతే చంపి బొందపెట్టి అన్న మాటను ఈ సమాజం మరిచిపోయిందా...**

నేటి తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాలు మద్యానికి బానిస అయిపోయి సంసారాలు పాడైపోతుంటే ఇంకా మౌనం మంచిది కాదు... యువత కీళ్ల నొప్పులతో బాధ పడుతూ తెలంగాణ రాష్ట్రం కొంటుపడిపోతుంది... 40 ఏళ్లకే పెన్షన్ ఇస్తాం అన్న అంటే అతిశక్తి కాదు.. ప్రతి ఆడబిడ్డకు మహాలక్ష్మి అయిన గృహలక్ష్మి అయిన ఆసరా అయిన తన ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి ఉపాధి అవసరం... అలాంటి మహిళా సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతవరకు సఫలీకృతం చేసింది... ఆత్మ గౌరవ నినాదంతో మరొక్కసారి తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు మార్పు తీసుకురావడానికి పార్టీలకతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మార్పును కోరుతూ మరొక అడుగు ముందుకు వేయాలి ఇదే సరైన సమయం....



...✍ **కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్**
సీనియర్ జర్నలిస్ట్

## సంక్షేమ పథకాలే విజయాన్ని కట్టబెడతాయి

✍ **జయభేరి, మేడ్చల్ :**

బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మరోసారి బిఆర్ఎస్ కు అధికారం కట్టబెడతాయని కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ అన్నారు. బుధవారం మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు గురించి వివరించారు. కేసీఆర్ సర్కార్ అమలు చేసిన రైతుబంధు,రైతుబీమా,ఆసరాపెన్షన్లు,కేసీఆర్కిట్, గృహలక్ష్మి,మైనారిటీ బంధు,బి సి బందు వంటి సంక్షేమ పథకాలు ప్రజల మన్ననలు పొందాయన్నారు. అలాగే కేసీఆర్,కేటీఆర్, సహకారంతో మేడ్చల్ నియోజకవర్గాన్ని మంత్రి మల్లారెడ్డి అభివృద్ధి చేస్తూ తన సొంత నిధులతో మేడ్చల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో,పట్టణాల్లో సిసి రోడ్లు, కుల సంఘాల భవనాలు, ఆలయాలు, మండపాలు కట్టించారని కౌన్సిలర్ కొడే



మహేష్ కురుమ తెలియజేశారు. కాంగ్రెస్ నేతలు ఇస్తున్న మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని సూచిస్తూ మరోసారి మంత్రి మల్లారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కౌన్సిలర్ తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి పెంజర్ల భాస్కర్ యాదవ్,మేడ్చల్ పట్టణ మాజీ వార్డు మెంబర్ కొడే నాగేందర్ కురుమ,మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఒగ్గు శంకర్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ బీ ఆర్ ఎస్ పార్టీ బి సి సెల్ ప్రధాన కార్యదర్శి కొడే వెంకటేష్ కురుమ,23వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొడే శ్రీశైలం కురుమ,23వ వార్డు బీ ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉద్దెమర్రి రాజు ముదిరాజ్,మహ్మద్ ఉమ్మర్,మొలంగిరి విజయ్ చారి,మహ్మద్ అజర్,కొడే రాజు,మహ్మద్ సోను,పెంజర్ల సాయి యాదవ్,చింటు,నాని మేడ్చల్ మున్సిపాలిటీ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఫలించిన బుజ్జగింపులు

ప్రకటించారు. ఎంపీ సీటు ఇస్తామన్న ప్రకటనతో రమేష్ నామినేషన్ను విత్ డ్రా చేసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 2898 నామినేషన్లను ఈసీ ఆమోదించింది. అత్యధికంగా గజ్వేల్ బరిలో 86 మంది అభ్యర్థులు నిలవగా.. అత్యల్పంగా నారాయణపేటలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. చాలా చోట్ల రెబల్స్ పోటీలో దిగడంతో ఆయా పార్టీల నేతలు వారిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఆ బుజ్జగింపులతో పలువురు వెనక్కి తగ్గారు. బరిలో నుంచి తప్పుకున్న నేతలకు పార్టీలో పదవులు లేదంటే ప్రభుత్వం వస్తే అధికారిక పదవులు ఇస్తామని పార్టీలు హామీలిచ్చాయి. ఇక డోర్నకల్లో కాంగ్రెస్ రెబల్గా నెహ్రూ నాయక్ బరిలోకి దిగారు. ఆయన పోటీలో ఉండే పార్టీ ఓట్లు చీలిపోతాయని భావించి చర్చలు జరిపారు. ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన వెనక్కి తగ్గారు.బాన్సువాడలో టికెట్పై కాసుల బాలరాజు ఎన్నో ఆశలు పెట్టుకున్నా టికెట్ రాకపోవడంతో.. ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. చికిత్స తర్వాత కోలుకున్న బాలరాజు.. రెబల్గా నామినేషన్ వేశారు. అయితే పార్టీ బుజ్జగింపులతో వెనక్కి తగ్గారు. ఈయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని పార్టీ హామీ ఇచ్చింది.జుక్కల్లో రెబల్గా నామినేషన్ వేసిన గంగారాంకి సైతం ఎమ్మెల్సీ హామీ ఇచ్చింది అధిష్టానం. దీంతో ఆయన కూడా పోటీ నుంచి విరమించుకున్నారు. ఇక వరంగల్ వెస్ట్లో జంగా రాఘవరెడ్డి కూడా రెబల్గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అది పార్టీపై ప్రభావం చూపుతుందని గ్రహించిన పార్టీ పెద్దలు.. బుజ్జగించారు. ఎమ్మెల్సీ లేదంటే డీసీసీ పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు.వీళ్లే కాకుండా పినపాక, వైరా సహా పలు నియోజకవర్గాల్లోనూ రెబల్స్ను బుజ్జగించడంలో కాంగ్రెస్ విజయవంతమైంది. పెద్దగా ప్రభావం చూపలేకపోయిన వ్యక్తులతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులను కూడా కొంత మందిని పోటీ నుంచి తప్పించింది కాంగ్రెస్.

# బండారి లక్ష్మారెడ్డి కి మద్దతిచ్చిన కురుమ సంఘం



✍ జయభేరి, ఉప్పల్:

ఉప్పల్ నియోజకవర్గ, చిల్కానగర్ డివిజన్ బీరప్ప గడ్డలో కురుమ సంఘం అధ్యక్షులు గోరిగ ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కురుమ సంఘ సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఉప్పల్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ రాగిడి లక్ష్మారెడ్డి సంఘ సభ్యులందరూ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ నాయకత్వంలో తాము సంతోషంగా ఉన్నామంటూ, తమకు బిఆర్ఎస్ ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని తమ సంపూర్ణ మద్దతిచ్చారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత వారికి రాజకీయ ప్రాధాన్యత లభించిందని, తెలంగాణ రాష్ట్రంలో గొల్ల, కురుమల క్షేమం గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. కులవృత్తులకు చేయూతను అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. అలాంటి నాయకుడికి మీరందరూ అండగా నిలవాలని కోరుతూ, ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ మూడవసారి ముఖ్యమంత్రిని చెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గొరిగ రమేష్, బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ గోపు సదానంద్, మేకల భాస్కర్ రెడ్డి, ఆలయ అధ్యక్షులు వెంకటేష్, ఆలయం ఉపాధ్యక్షులు బాలకృష్ణ, హమాలి శ్రీనివాస్, రఘు, గొరిగ ఐలేష్, కొండ్ర హనుమంతు, పలువురు బిఅర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే బిఆర్ఎస్ పార్టీకి ఓటెయ్యండి

✍ జయభేరి, ఉప్పల్ :

హబ్సిగూడ డివిజన్, మహేశ్వర్ నగర్ కాలని కమిటీ హాల్ లో, హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు ఠాకూర్ సింగ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మీ అనుభవంలో ఎన్నో ప్రభుత్వాలు చూసిన మీకు, తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మీ కళ్లముందే కనపడుతుందన్నారు. అభివృద్ధిలో తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టిన బిఅర్ఎస్ పార్టీకి మీరందరూ మద్దతివ్వాలని కోరుతూ, కేసీఆర్ గారు సీనియర్ సిటిజన్స్ కి అన్నిరకాలుగా అండగా ఉన్నారని, వారికోసం ప్రవేశపెట్టిన పథకాలను ఒక్కొక్కటిగా వివరిస్తూ, ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్ళీ బిఅర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటు, కేసీఆర్ గారు హ్యాట్రిక్ సీఎం కావలని కొరుతూ, ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపియ్యాలని సీనియర్ సిటిజన్స్ ని బండారి లక్ష్మారెడ్డి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సభ్యులు, బిఆర్ఎస్ సీనియర్ మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# విక్రమ్ రెడ్డిని బుజ్జగించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

✍ జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ గత కొన్ని సంవత్సరాలుగా మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యకుడిగా జిల్లాలో అనేక కార్యక్రమాలతో బిజెపి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకోసం అహర్నిశలు కృషి చేసిన తనకు బిజెపి అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని అలకపూనిన పట్లోళ్ల విక్రమ్ రెడ్డిని బుధవారం కేంద్రమంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తన నివాసానికి పిలుచుకొని సముదాయించారు.మేడ్చల్ నియోజకవర్గంలో పార్టీ ఎదుగుదల కోసం విక్రమ్ రెడ్డి సేవను పార్టీ గుర్తిస్తుందన్నారు. భవిష్యత్తులో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు విక్రమ్ రెడ్డి నామినేషన్ విడ్రా చేసుకున్నట్లు విక్రమ్ రెడ్డి తెలిపారు.

# బండారి లక్ష్మారెడ్డి కి వీర తిలకం

✍ జయభేరి, కాప్ర:



ఉప్పల్ నియోజకవర్గ, కాప్ర డివిజన్ లో నిర్మల్ నగర్ చర్చి నుండి ప్రారంభించి వల్వర్ నగర్, కందిగూడ లో భారీగా పాల్గొన్న కార్యకర్తలతో కలిసి గల్లీ గల్లీ తిరుగుతూ, గడపగడపకు వెళ్లి, ప్రభుత్వ పథకాలను, కేసీఆర్ బీమాప్రతి ఇంటా ధీమాను, మేనిఫెస్టో ను ప్రజలకు స్పష్టంగా వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటికి తగిన హామీలిస్తూ జోరుగా ప్రచారం చేస్తున్న బండారి లక్ష్మారెడ్డికి కాప్ర డివిజన్ ప్రజలు బాణసంచా పేలుస్తూ, వీర తిలకం దిద్ది, విజయ హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ ప్రచారంలో బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు మరియు మహిళా కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ ఉంటే ప్రజల్లో వ్యతిరేకత మాత్రమే కాదు విరక్తి

✍ జయభేరి, మేడిపల్లి :

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ గెలుపుకై ఫిర్జాధీగూడా మున్సిపల్ కార్పొరేషన్ రెండో వార్డులోమహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత బద్రునాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేస్ యాదవ్ కూతురు డాక్టర్ సరిత ముఖ్యఅతిథి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేషన్ లో అధికార పార్టీ కబ్జాలు, దౌర్జన్యాలు, వసూలు అరాచకం తగ్గాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బిఆర్ఎస్ ఉంటే ప్రజల్లో ఉన్నది వ్యతిరేకత మాత్రమే కాదని విరక్తి చెందారని స్పష్టంగా ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారు అనడానికి ప్రజలు హారతులు పట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆశీర్వదిస్తున్నారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో PMC కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మేడ్చల్ జిల్లా లీగల్ చైర్మన్ ఒంగేటి ప్రభాకర్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా వర్కింగ్ ప్రెసిడెంట్లు లు రంజిత్ రెడ్డి, లోడే పవన్ కుమార్ గౌడ్, ముదిగొండ రమేష్, సీనియర్ నాయకులు వేముల నాదం గౌడ్, గారురాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ మోహన్ కుమార్, ఉపాధ్యక్షులు ఐలేష్ యాదవ్, అధికార ప్రతినిధి కవిడ కుమార్, జంగాచారి, మనిరామ్ నాయక్, యూత్ అధ్యక్షులు బుడిగే ఉదయ్ కుమార్ గౌడ్, మెరుగు వెంకటేష్ యాదవ్, ఉపరి ఉదయ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పంగరాజు, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, బర్రె నాగరాజు, యూత్ నాయకులు మల్లేష్ నాయక్, భాను ప్రకాష్ రెడ్డి, మహిళ నాయకురాలు నందిత గౌడ్, నిర్మల, దేవి గారు మొదలగు అనేక మంది మహిళలు గడపగడప కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఎన్ఆర్ఈసీలో ఘనంగా ఓరియెంటేషన్ డే

✍ జయభేరి, మేడ్చల్ :

విద్యార్థులు మంచి ప్రణాళిక, క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయాలు వాటంతట అవే వరిస్తాయని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి పరిధిలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 2023 వ సంవత్సరంలో చేరిన నూతన ఎంబీఏ విద్యార్థులకు ఓరియెంటేషన్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెల్లరైట్ సిస్టమ్స్ వ్యవస్థాపకులు ముఖ్య కార్యనిర్వహణాధికారి సృజన రఘుపాత్రుని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ భావి భవిష్యత్తుకు ఇప్పటి నుంచే పునాదులు వెయ్యాలని తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచన చేశారు.అనంతరం సృజన రఘుపాత్రుని మాట్లాడుతూ తమ అనుభవాలను, ఆలోచనలను పంచుతూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు.నేటి విద్యార్థులు రేపటి వ్యాపారవేత్తలుగా మారాలని ప్రోత్సహించారు.విద్యార్థులు ప్రస్తుతం తమ విద్యార్థి దశలో కష్టపడితే తర్వాత ఆనందంగా తమ భవిష్యత్తుని గడపవచ్చునని సూచించారు. ప్రిన్సిపాల్ డా॥ఆర్ లోకనాథం మాట్లాడుతూ తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఆర్.లోకనాథం,ఎంబీఏ విభాగాధిపతి డా॥ప్రమోద హోలీ స్టార్,పలువిభాగాధిపతులు,అధ్యాపకులు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బండారి లక్ష్మారెడ్డి వినూత్న ప్రచారం

✍ జయభేరి, కాప్ర:




మీర్ పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ అధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తిరుమల నగర్ నుండి ప్రారంభించిన ప్రచార యాత్రలో ఇంటింటికి తిరుగుతూ, బిఆర్ఎస్ మేనిఫెస్టో గురించి స్పష్టంగా వివరిస్తూ, కాలనీల సమస్యలన్నీ ఓపిక తెలుసుకుంటూ, రేపు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవన్నీ పరిష్కరిస్తానని హామీ ఇస్తూ, ఇస్త్రీ చేస్తూ, బట్టలు కుడుతు, మటన్ కొడుతు, కూరగాయలు అమ్ముతు, చాయ్ పెడుతు, ఆటో నడుపుతు, దోశలు వేస్తూ, వినూత్నంగా ప్రచారం చేస్తూ మీర్ పేట్ ప్రజల మనసు గెలుచుకున్నారు. వినూత్నంగా ప్రచారం చేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతూ, బిఆర్ఎస్ సైన్యంతో ముందుకు సాగుతున్న బండారి లక్ష్మారెడ్డికి విశేష స్పందన లభిస్తుంది. వీర తిలకాలు దిద్దుతూ, పుల మాలలు వేసి, శాలువాలతో సత్కరిస్తూ, మంగళ హారతులు పడుతూ ఘనంగా స్వాగతం పలికారు. పేద ప్రజల కష్టాలు తీర్చే ప్రజా సేవకుడు బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గా ఉండాలని కోరుకుంటూ భారీగా మద్దతు తెలిపారు. ఈ ప్రచారంలో నాయకులు, మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# బిఎల్ఆర్ నీ భారీ మెజారిటీతో గెలపిస్తాం

✍ జయభేరి, కాప్ర:



మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్, మంగాపురం కాలనీ, శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం కాప్రా సర్కిల్ వారు, బిఆర్ఎస్ ప్రభుత్వం తోనే తమ సామాజిక వర్గానికి మంచి జరుగుతుందనే నమ్మకంతో, వ్యక్తిగతంగా అందరికీ సుపరిచితుడైన బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి నిత్యం పేద ప్రజలకు అండగా ఉంటూ, పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి కలిగిన బండారి లక్ష్మారెడ్డి లాంటి నాయకుడు ఉప్పల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉంటే, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో, ఉప్పల్ నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటేసి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని, తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. ఈ నేథ్యంలోనే తమ విశ్వకర్మ టెంపుల్ సంఘ కార్యాలయ నిర్మాణానికి కొంత స్థలం కేటాయించి, నిర్మాణం చేపట్టాల్సిందిగా బండారి లక్ష్మారెడ్డిని కోరడంతో, రేపు ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ గెలిచిన వెంటనే, మీరు కోరిన విధంగానే అర్హులైన వారందరికీ బీసీబందు లక్ష రూపాయలు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చేలా కృషి చేస్తానని, అలాగే సంఘ భవన నిర్మాణం చేపడతామని, బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.



# కాంగ్రెస్ పార్టీ పై విశ్వాసం

✍ జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ మున్సిపాలిటీ లోని లక్ష్మి నగర్ కాలనీ మాజి అధ్యక్షులు రమేష్ ఆయన అనుచరులు బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నరసింహ రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ అద్వర్యం లో కాంగ్రెస్ లో చేరారు. తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పై విశ్వాసం ఉంచి పార్టీ లో చేరినందుకు ప్రతి ఒక్కరికి ధాన్యవాదాలు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యం గా పని చేయలని వారిని సూచిచారు.



# కాంగ్రెస్, బీజేపీలు గెలిస్తే.. ఢిల్లీ నుంచే పాలన

✍ జయభేరి, కరీంనగర్, నవంబర్ 15 :

జగిత్యాల జిల్లాలో కథలాపూర్ లో బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు బీడీ చుట్టే కార్మికులను పట్టించు కోలేదు.. కటాఫ్ తేదీ లేకుండా డిసెంబర్ 3 తర్వాత తప్పకుండా అర్హులైన అందరికీ పెన్షన్లు ఇస్తామన్నారు. మీకు రెండు ఛాన్స్ లు ఇచ్చాం కదా అని ఇంకో ఛాన్స్ ఇంకొకరికి ఇవ్వొద్దు..మీరు ఓడిపోతేనే తెలంగాణ గెలుస్తొంది.. మోడీ అల్లం, బెల్లం అన్నాడు మోచేతికి బెల్లం పెట్టాడు అంటూ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.18 ఏళ్లు నిండిన మహిళలకు కూడా పెన్షన్ ఇస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో నెంబర్ వన్ గా ఉన్నాం.. సీఎం కేసీఆర్ ను ఓడించేందుకు యోగి, భోగి, షేర్లు వస్తున్నారు.. కాంగ్రెస్, బీజేపీ వాళ్లకు టికెట్లు, బీ ఫాంలు ఢిల్లీలో ఇస్తారు ఇక్కడ కాదు అంటూ ఆయన మండిపడ్డారు. ఆడబిడ్డల ఉసురు పోసుకున్న ఏ పార్టీ బాగుపడదు.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తుల ఉమకు మంచి పదవి ఇప్పిస్తానని కేటీఆర్ మాట ఇచ్చారు.

# వెయ్యిర ఓటు చెయ్యి గుర్తుకు ఓటు

✍ జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ నియోజకవర్గం మూడుచింతలపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొల్తూరు, పోతారం, అనంతారమ్, నారాయణపూర్, గ్రామమాలలో నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ జోరుగా ప్రచార కార్యాక్రమానికి రాష్ట్ర సీనియర్ నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్, ZP చైర్మన్ శరత్ చంద్రారెడ్డి తో కలిసి పాల్గొన్న మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్. ఈ కార్యక్రమము లో వారు మాట్లాడుతూ.. 10 సంవత్సరాలలో పెరిగింది ఏమైనా ఉందీ అంటే అది అవినీతి మాత్రమేనని, త్యాగాలు చేయని కుటుంబానికి అధిక సంఖ్యలో పదవులు ఎందుకు అని, రాష్ట్ర ఏర్పాటులో అమరులైన కుటుంబానికి ఒక పదవీ కూడా ఇవ్వలేదు అని స్వీట్లు పంచినట్లు ఇంట్లో పదవులు పంచారని రాష్ట్రప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. కేసీఆర్ ని స్ఫూర్తిదాయకంగా తీసుకోని ఇక్కడ మల్లారెడ్డి కూడ ఆయన దారిలో నడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి

# బీఎస్పీ తోనే తండాలు అభివృద్ధి

- సువేన్ కంపెనీలో స్థానికులకే ఉద్యోగ అవకాశం
- మాజీ ఉప సర్పంచ్ బిక్షం నాయక్ చేరికతో పార్టీకి మరింత బలం
- బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

బీఎస్పీ పార్టీ గెలిస్తేనే తండాలు అభివృద్ధి చెందుతాయని, సువెన్ కంపెనీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ 6వ వార్డు పరిధిలో గల వస్రాం తండాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకాలం స్థానికేతర ల కు ఓటు వేసి గెలిపించుకున్నాం, కానీ ప్రస్తుతం స్థానికుడినైనా నాకు ఒక్కసారి అవకాశం కల్పించాలని కోరారు తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారు తప్ప అభివృద్ధి కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ వస్తే అభివృద్ధి చెందుతుంది అనుకున్నాము కానీ తండాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. గతంలో ఓట్లు వేసిన నాయకులు అక్రమ సంపాదనకు పాల్పడ్డారు తప్ప ప్రజల అభివృద్ధి కోసం పనిచేయలేదని అన్నారు. బహుజనులు అభివృద్ధి చెందాలంటే బీఎస్పీ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధరావత్ నీలాబాయి లింగా నాయక్, సేవ్య నాయక్, దేశబోయిన సురేష్, నాగరాజు, హరి ప్రసాద్, కృష్ణ నాయక్, నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వస్త్రం తండా మాజీ ఉప సర్పంచ్ ధరావత్ బిక్షం నాయక్, జిల్లా మహిళా సంఘం నాయకురాలు ముత్యాలి తో పాటు 50 మంది కార్యకర్తలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి వట్టే జానయ్య యాదవ్ సమక్షంలో బిఎస్పి పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకొని బిఎస్పీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కాంతమ్మ, కౌసల్య, శైలి, భారతమ్మ, వెంకటయ్య, రాములు, సేవ్య, జామ్లు, కౌసల్య, అచ్చాలి తదితరులు బిఎస్పి పార్టీలో చేరారు.







cVIGIL
Election Commission of India

## ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం

- యువత ప్రముఖ పాత్ర పోషించాలి.
- అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక.

**జయభేరి, సూర్యాపేట :**

ప్రజల చేతిలో ఓటు వజ్రాయుధం అని, సరైన పద్ధతిలో ఉపయోగించినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. అవినీతి, అక్రమాలు లేని స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం యువత కృషి చేయాలి అని విజ్ఞప్తి చేశారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఓటరు చైతన్య సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా క్షేత్ర ప్రచార అధికారి జి. కోటేశ్వర్ రావు అధ్యక్షత వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ నిజాయితీగా ఓటు వేసేలా చైతన్యం నింపాలని యువతను కోరారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో కీలకమే అని అన్నారు. ఎన్నికల అక్రమాలను అడ్డుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం తెచ్చిన సీ విజిల్ మొబైల్ యాప్ నీ యువత ఉపయోగించాలని కోరారు. అనంతరం ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఓటరు కోసం అందుబాటులోకి తెచ్చిన వివిధ మొబైల్ యాప్ సేవలను వివరించారు. ఎన్నికల సంఘం ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ విద్యార్థులతో డౌన్లోడ్ చేయించారు. అందులో అన్నీ రకాల సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్వీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు, తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీల, అధ్యాపకులు శర్మ, కవిత, అరుణ, ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీ సీ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల అందచేశారు.



**కుడకుడ 1, 2, 15 వార్డులో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి వట్టె జానయ్యా యాదవ్ గారి గెలుపు కై డోర్ to డోర్ ప్రచారం చేసిన ఆవుదొడ్డి శ్రీకాంత్, కంచుగట్ల సందేశ్,షకీల్, కంచుగట్ల నవీన్,వల్లపు శంకర్, బొడ్డు సతీష్ నాగరాజు, రాజు.**



## రాజ్యాధికార లక్ష్యమే బీఎస్పీ ఎజెండా

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని చివ్వెంల మండలం భీమ్లా నాయక్ తండకు చెందిన 100 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గారి సమక్షంలో బుధవారం బీఎస్పీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బిక్కు నాయక్ తో పాటు దేవరాజ్, సురేందర్, బోజ్యా, వస్త్రం, మోతి, సాలమ్మ,శాంతి, విజయ, సునీత, వినోద్, భోగి, భగవాన్, మంగమ్మ, గోపి, భాగ్య, కుమారి, జ్యోతి, సోనియా, బుజ్జి తదితరులు ఉన్నారు.





## నూతన హోటల్ ను ప్రారంభించిన వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీ తండా చెందిన లూనావత్ సాగర్ పట్టణంలోనీ కుడకుడ రోడ్డు లో నూతన హోటల్ ను ప్రారంభించిన బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గారు ఆయన వెంట కుంభ వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



## గడప గడప ప్రచారం

**జయభేరి, సూర్యాపేట :**

16వ వార్డు ప్రచారంలో భాగంగా బహుజన సమాజ్ పార్టీ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ గెలుపు కోసం ఏనుగు గుర్తును చూపుతూ గడప గడప ప్రచారం కొనసాగిస్తున్న 9వ వార్డు ఇన్చార్జి ఏశబోయిన మల్లేష్ యాదవ్, పాంపాటి సతీష్ మరియు , ఉప్పల జయశంకర్ , లావణ్య, , కమలమ్మ, పందిరి సరస్వతి, P.పరశురాం, సాయిరేఖ, కే.శోభన్ బాబు, యాదవ్, కత్తుల వెంకటరత్నం , రాపోల్ శైలజ, సర్దార్ అనూష, ఏశబోయిన మమత, ఎస్.కె కరీం, ఎస్.కె జిలాని, సైదులు నాయక్, తదితర నాయకులు , 9 వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## ఆపరేషన్ కాంగ్రెస్

- తెలంగాణ లో కర్ణాటక ఫార్ములా

**జయభేరి, సూర్యాపేట :**

పోటి చేసే అభ్యర్థులను గెలిపిస్తే టిక్కెట్ లు రాని వారికి పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పదవులు అనే విధానాన్ని కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో అమలుచేసి విజయం సాధించింది.... అదే ఫార్ములా తెలంగాణలో అమలుచేస్తుంది... అందులో భాగంగానే సూర్యాపేట లో అసమ్మతి నేతగా నామినేషన్ వేసిన పటేల్ రమేష్ రెడ్డి నామినేషన్ ఉపసంహరించే విధంగా,కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పావులు కదిపింది.... ఈ రోజు ఉదయం మల్లు రవి, రోహిత్ చౌదరి లు సూర్యాపేట కు వచ్చి అసమ్మతి నేత పటేల్ రమేష్ రెడ్డి తో చర్చలు జరిపారు. ... అనంతరం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి తన నామినేషన్ ను ఉపసంహరించుకున్నారు.... త్వరలోనే పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ని ఆయన కలవనున్నారు.. సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి గెలుపు కొరకు పనిచేస్తానని ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి తెలిపారు....

## బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని సూర్యాపేట రూరల్ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన 50 మంది కార్యకర్తలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి మాజీ సర్పంచ్ సాయిని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గారి సమక్షంలో బుధవారం బిఎస్పీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చింత నాగయ్య, చింత శ్రీధర్, చింత వెంకన్న, బూర్గుల సోమమ్మ, బూర్గుల వెంకటమ్మ, ఎల్లమ్మ తదితరులు పార్టీలో చేరారు.



## 33వ వార్డు నుంచి చేరికలు

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి లోని 33వ వార్డుకు చెందిన 20కుటుంబలు, కనుకు ప్రవీణ్, వెంకటరెడ్డి, సతీష్,కళ్యాణ్,సాకేత్, జగన్, అరవింద్, నందు, వినీత్, మౌలానా,ప్రకాష్, విక్రాంత,ప్రణయ్, మణి,విక్కీ, జయంత్ బుదవారం బీజేపీ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి వెంపటి నాగమణి ఆధ్వర్యంలో, బీఎస్పీ పార్టీ సూర్యాపేట ఇంచార్జి గందూరి కృపాకర్ గారి సమక్షంలో ప్రాథమిక సభ్యత్వం తీసుకొని Bsp పార్టీలో చేరారు. నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వంను నిరుద్యోగులంతా ఏకమై బహుజన పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి వట్టే జానయ్యయాదవ్ గారిని గెలిపించాలని కోరారు కార్యక్రమం లొ గందూరి రమేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.




## టేకుమెట్ల గ్రామం నుంచి చేరికలు



**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట మండలం టేకుమెట్ల గ్రామానికి చెందిన మండారి కిరణ్, ప్రవీణ్, ప్రశాంత్, జగన్, వరుణ్, మహేష్, అఖిల్, జానకిరాములు బుదవారం బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి బీఎస్పీ పార్టీ సూర్యాపేట ఇంచార్జి గందూరి కృపాకర్ గారి సమక్షంలో ప్రాథమిక సభ్యత్వం తీసుకొని Bsp పార్టీలో చేరారు. ప్రజల కోసం ఏమైనా చేయాలని నిరుద్యోగులంతా ఏకమై బహుజన పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి వట్టే జానయ్యయాదవ్ గారిని గెలిపించాలని కోరారు కార్యక్రమం లొ గందూరి రమేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మన రాతను మనమే మార్చుకోవాలి

**అవినీతిపరులను ఎదిరించిన సూర్యాపేట రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిల కాళ్లు కడుగుతున్నాను**

**మన రాతను మనమే మార్చుకోవాలి అందుకుగాను ఓటు ఆయుధాన్ని ఉపయోగించాలి**

**బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్**



**జయభేరి, సూర్యాపేట :**

అబద్దాల కోరు మాటలతో గ్రామాలకు వచ్చిన మంత్రి జగదీశ్ రెడ్డి ని ధైర్యంతో ఎదిరించిన సూర్యాపేట రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి ల కాళ్లు కడుగుతున్నాను అని బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గారు అన్నారు. బుధవారం చివ్వేంల మండలం తిమ్మాపురం, మోదిన్ పురం, జగ్గు తండా గ్రామాలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు కోలాటంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా తల్లిదండ్రులు, ఆడపడుచుల స్థానంలో ఉన్నవారి కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటున్నానని ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. గతంలో మన ప్రజలు అవగాహన లేక ఓట్లు వేశారని, కానీ ప్రస్తుతం సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులు కావడంతో ఇక వారి ఆటలు చల్లవని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గ గ్రామాలలో కూలిన పెంకుటిల్లు, తరుబాలు



కట్టిన రేకుల కొట్టాలు దర్శనమిస్తున్నాయని, ఇదేనా డబల్ బెడ్ రూముల అభివృద్ధి అని ప్రశ్నించారు. మన రాతను మనమే మార్చుకోవాలి అందుకోసం మీ వద్ద ఉన్న ఓటు ఆయుధాన్ని ఉపయోగించాలని అన్నారు. నేను నిజాలు చెప్పి ఓటర్లను చైతన్య పరుస్తున్నానని ప్రజలను నా మాటలు కూడా వినకుండా నిర్బంధానికి గురి చేస్తున్నారని అన్నారు. అక్రమ దోపిడీకి పాల్పడుతున్న అగ్రకుల నాయకుల ఓటమి కోసం బీఎస్పీ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలాపురం సర్పంచి బోడబట్ల సునీత శ్రీను, పాతర్లపాడు సర్పంచ్ కేశబోయిన మల్లయ్య, బిఎస్పి జిల్లా నాయకులు సుంకరబోయిన రాజు, దేశబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపురం గ్రామం నుంచి కేశబోయిన సైదులు, కొమ్ము చంద్రయ్య, గుండాల మధు, మున్నా నవీన్, బల్గురి నాగరాజు, కొమ్ము లెనిన్, వీరబోయిన సైదా లింగం, మున్నా రవి, కుమ్ము నాగరాజు, గుండాల నాగరాజు, గుండాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. మోదిన్ పురం గ్రామం నుంచి ఇరుగు సైదులు, చెరుకు శేఖర్, చిలుముల శంకర్, చిలుముల ఉపేందర్, వంగూరి శేఖర్, సగరపు శ్యాంసుందర్, చిలుముల వెంకన్న, చిలుముల రవి, జీడి చరణ్ కుమార్, చందుపల్లి పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ కళాశాలలో ఉద్యోగాల పేరుతో మోసం

### 42 మంది బాధితుల నుండి రూ.63.60లక్షల వసూళ్లు చేసిన అటెండర్

**జయభేరి, సూర్యాపేట:**

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి 42 మంది వద్ద నుండి రూ. 63.60లక్షలు వసూళ్లు చేసి మోసం చేసిన అటెండర్ షేక్ నవీబ్ పాషాపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సతీష్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల గేటు ఎదుట ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అటెండర్ గా పని చేస్తున్న నవీబ్ పాషా జీఎస్ సెక్యూరిటి మ్యాన్ పవర్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వహకులు మధుసూదన్ రెడ్డి వద్ద పీ.ఏగా పని చేస్తున్నానని మీకు మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తాని నమ్మించి ఒక్కో వ్యక్తి నుండి రూ. 2లక్షల చొప్పున 42 మంది వద్ద ఒప్పుందం చేసుకున్నట్లు తెలిపారు. ఆ తరువాతా విడతల వారిగా బాధితులు అందరు నవీబ్ పాషాకు రూ. 63.60ల రూపాయలు నగదు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆ తరువాతా తమకు ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తారని ప్రశ్నించగా మెడికల్ కళాశాల ప్రారంభం ఆలస్యమవుతుందని సాకు చూపుతు కాలయాపన చేశారని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రారంభం అయ్యాక నిలదీయడంతో ఏజెన్సీ వారికి, కళాశాల ప్రిన్సిపల్ గోడవలు జరుగుతున్నాయని సర్ధుమణిగాకా ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించినట్లు తెలిపారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు నవీబ్ పాషాపై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు మహేశ్వరి, శ్రీలేఖ, ఆశ తదితరులు ఉన్నారు.




## ముగిసిన ఐటీ దాడులు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15 :**

తెలంగాణ ఎన్నికల వేళ ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారు. రాజకీయ నేతలు, వారి అనుచరులు, బంధువుల ఇళ్లు.. వారికి సంబంధించిన కంపెనీలలో వరుస తనిఖీలు చేస్తున్నారు. ఫార్మా కంపెనీల్లోనూ సోదాలు చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి ఇంటిపై కూడా ఐటీ దాడులు జరిగాయి. అలాగే తుమ్మల నాగేశ్వరరావు, జానారెడ్డి, పారిజాత నరసింహారెడ్డి ఇంటిపై కూడా ఐటీ అధికారులు రైడ్స్ చేశారు. తాజాగా తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరులు, బంధువుల ఇళ్లలోనూ ఐటీ దాడులు జరిగాయి. మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరుడు ప్రదీప్రెడ్డి ఇంట్లో మూడు రోజులుగా జరిగిన ఐటీ శాఖ తనిఖీలు ముగిశాయి. గత మూడు రోజులుగా ఆయన ఇంటికి మొత్తం సోదా చేశారు ఐటీ అధికారులు. భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మహేశ్వరంలో ఎన్నికల ఖర్చుల కోసం సమకూర్చుకున్న డబ్బుగా ఐటీ అధికారులు చెప్తున్నారు. ప్రదీప్రెడ్డికి మంత్రి సబితా కుమారుడితో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ఐటీ అధికారులు తేల్చారు. ప్రదీప్రెడ్డితోపాటు కోట్ల నరేందర్రెడ్డి ఇంట్లోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. నరేందర్రెడ్డి ఇంట్లో ఏడు కోట్ల 50 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నుంచి హైదరాబాద్లోని ప్రాంతాల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఏకకాలంలో 15 చోట్ల రైడ్స్ చేశారు. రాజకీయ నాయకులు, వారి బంధువులతోపాటు... ఫార్మా కంపెనీలను కూడా టార్గెట్ చేశారు. కంపెనీల యజమానులు, డైరెక్టర్ల ఇళ్లలోనూ తనిఖీలు చేశారు. ఉదయం నుంచి అమీన్పూర్లోని పటేల్గూడ, ఆర్సీపురం, వట్టినాగులపల్లి, గచ్చిబౌలిలోని మైహోం భుజాలో సోదాలు నిర్వహించాయి. మైహోమ్ భుజాలో ఉంటున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరులు ప్రదీప్ ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. ఎన్నికల వేళ వివిధ పార్టీలకు చెందిన నాయకులకు పలు ఫార్మా కంపెనీల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు అందుతున్నట్టు వచ్చిన సమాచారంతో ఐటీ అధికారులు రైడ్స్ చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఖమ్మం జిల్లా పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగేలేటి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు పారిజాత నరసింహారెడ్డి, ఆ పార్టీ అభ్యర్థి కేఎల్ఆర్, మాజీ మంత్రి జానా రెడ్డి నివాసాలపై కూడా ఐటీ దాడులు జరిగాయి. ఖమ్మం జిల్లాకు చెందిన మరో కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరావు ఇంట్లో కూడా ఐటీ అధికారులు దాడులు చేశారు. తమ ఇళ్లపై ఐటీ దాడులు... బీఆర్ఎస్, బీజేపీ కలిపి చేయిస్తున్న కుట్ర అని ఆరోపిస్తున్నారు కాంగ్రెస్ నేతలు.

## ఆత్మ బలిదానాలు మాకు రాజకీయ ఉద్యోగాలు మీకా..?

**జయభేరి, సూర్యాపేట :**

తెలంగాణ వస్తే బ్రతుకులు మారుతాయని విద్యార్థులు ఆత్మబలిదానం చేసుకొని తెలంగాణ సాధించుకుంటే కెసిఆర్ కుటుంబానికి రాజకీయ ఉద్యోగాలు వచ్చాయని బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వేంల మండలం ఖాసింపేట, దురాజ్పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 46 జీవో ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, కానిస్టేబుల్ నియామకాలలో 130 మార్కులు వచ్చిన ఉద్యోగం రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల అభివృద్ధి పేరుతో 1000 కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన మంత్రి జగదీశ్ రెడ్డి అక్రమ సంపాదన బయటికి తీయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా పేద ప్రజలను తీవ్ర ఇబ్బంది గురి చేశారని అన్నారు. అగ్రకుల నాయకులకు ఓట్లు వేస్తే బిల్డింగుల పైనుంచి చూస్తారు కానీ, ప్రజల మధ్యలో కి వచ్చి పలకరించరని అన్నారు. ఎన్ని



కేసులు పెట్టినా బహుజనుల అండతో నిలబడతా నే తప్ప పారిపోనని ఘాటుగా స్పందించారు. ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్ ధరావత్ నీలాబాయి లింగా నాయక్, సర్పంచులు బోడబట్ల సునీత శ్రీను, కేశ బోయిన మల్లయ్య, సుంకర బోయిన రాజు, దేశబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాశంపేట నుంచి మండే గోపి, చిమట శ్రీశైలం, అలిశెట్టి బాలకృష్ణ, పలస కృష్ణ, మద్ది శ్రీను, మద్ది లింగయ్య, ఎస్కే హజార్, నిరుడు సాయి, వసంతపు కలింగం, వసంతపు ఎర్రయ్య, వసంతపు శ్రీకాంత్, వసంతపు లింగరాజు, అలిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు. దురాజ్ పల్లి గ్రామం నుంచి చింతకాయల జానయ్య, చింతకాయల కృష్ణ, మొండికత్తి లింగయ్య, మొండికత్తి శ్రీను, వలపట్ల లింగయ్య, వలపట్ల మధుసూదన్, సారయ్య, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు



## వివేక్ విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నారు

**జయభేరి, అదిలాబాద్, నవంబర్ 15 :**

చెన్నూరూ నియోజకవర్గంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వివేక్ వెంకట స్వామి డబ్బులు పంచుతున్నారని ఎమ్మెల్యే బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతరం మంచిర్యాల జిల్లాలో ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ని కలిసి వివేక్ పై ఫిర్యాదు చేశారు. చెన్నూరూ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ విచ్చవిడిగా డబ్బులు పంచుతున్నారని అన్నారు. వివేక్ పక్కన ఉన్న వారి అకౌంట్స్ లోకి డబ్బులు జమ చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్ఫోర్స్ మెంట్ ,ఇన్కమ్ టాక్స్ వాళ్లకు పిర్యాదు చేస్తామన్నారు. అకౌంట్స్ ని ఫ్రీజ్ చేయాలని సీఈఓని కోరామన్నారు. వివేక్ కుటుంబ సభ్యుల అకౌంట్స్ పై నిఘా పెట్టాలని సీఈఓని కోరామన్నారు. పెట్రోల్, బిల్డర్స్, రైస్ మిల్స్, సిమెంట్, స్టిల్ కంపెనీల వాళ్లకు డబ్బులు హైదరాబాద్ నుంచి పంపుతున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. వివేక్ కుటుంబం చేస్తున్న పాపంలో పాలు పంచుకోవద్దని వ్యాపారులను కోరుతున్నామన్నారు.బీజేపీలో వివేక్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ గా ఉన్నారని అన్నారు. వివేక్ నమ్మక ద్రోహి.. వాళ్ళ బీజేపీ జాతీయ పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేయలేదన్నారు. కక్ష్యతో బాల్క సుమన్ ని ఓడగొట్టారని చూస్తున్నారని అన్నారు. వేల కోట్లు బాల్క సుమన్ సంపదిస్తే వివేక్ లా వ్యాపారులు చేసే వాడని వ్యంగాస్త్రం వేశారు. వివేక్ వ్యాపారుల్లో ఛానెల్ లో ఉద్యోగాలు చేసే వాళ్ళు నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారని అన్నారు. వివేక్ తన తండ్రిని పట్టించుకోలేదన్నారు. వాళ్ళ తండ్రి కూడా నియోజకవర్గనికి ఏమి చేయలేదన్నారు. డబ్బులతో వివేక్ రాజకీయాలు చేస్తూన్నారని మండిపడ్డారు. ధన రాజకీయాలు, డబ్బు రాజకీయాలు చేసే వాళ్లు సమాజానికి మంచిది కాదని హెచ్చరించారు.

## ఇస్రో స్పేస్ ఛాలెంజ్

**జయభేరి, బెంగళూరు, నవంబర్ 15 :**


ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్ ప్రయోగాలకు సంబంధించి దేశవ్యాప్తంగా ఆసక్తి ఉంది. ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న యువత చంద్రయాన్ పై ప్రత్యేకంగా పరిశోధనలు చేస్తున్నరు. ఇలాంటి వారికి ఇస్రో గుడ్ న్యూస్ చెప్పింది. భవిష్యత్లో చేపట్టే అంతరిక్ష యాత్రల కోసం రోబోటిక్ రోవర్ల రూపకల్పనకు సంబంధించి యువత నుంచి వినూత్న ఆలోచనలు, డిజైన్లను ఆహ్వానించాలని నిర్ణయించింది. ఈ మేరకు స్పేస్ ఛాలెంజ్ను నిర్వహించనుంది. ఈ చాలెంజ్ లో ఎవరైనా పాల్గొనవచ్చు.చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్3 ల్యాండర్ను ఇస్రో విజయవంతంగా దించినింది. దీనికి కొనసాగింపుగా చంద్రునితో పాటు ఇతర ఖగోళ వస్తువుల వద్దకు మరిన్ని రోబోటిక్ యాత్రలు చేపట్టేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇస్రో లక్ష్యాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి కార్యకలాపాల్లో పాలుపంచుకునేందుకు విద్యా సంస్థలు, పరిశ్రమలకు అవకాశాలు కల్పించేందుకు చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా యువత నుంచి రోబోటిక్ రోవర్ల డిజైన్లకు సంబంధించిన వినూత్న ఆలోచనలను బెంగళూరులోని యూఆర్ రావు ఉపగ్రహ కేంద్రం కోరుతోంది. భవిష్యత్లో చేపట్టబోయే చేపట్టబోయే గ్రహాంతర యాత్రల కోసం యువతలోని సృజనాత్మక ఆలోచనలను ఉపయోగించుకోవడం, భాగస్వామ్య పక్షాలకు అంతరిక్ష రోబోటిక్స్లో అవకాశాలను కల్పించడం స్పేస్ చాలెంజ్ ఉద్దేశం. 'ఇస్రో రోబోటిక్స్ ఛాలెంజ్యూఆర్ఎస్సీ 2024'ని నిర్వహించనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రకటించారు. ఈ ఛాలెంజ్లో ప్రధానంగా ఒక ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ ఉంటుంది. అందులో సంస్థాగత బృందాలు రోబోలను నిర్మించాలి. అవి గ్రహాంతర పరిస్థితుల నడుమ పోటీ పడాలి. స్పేస్ రోబోటిక్స్లో ఎదురయ్యే వాస్తవ సవాళ్ల ఆధారంగా లక్ష్యాలను నెరవేర్చాలి. చక్రాలు లేదా కాళ్లతో కూడిన రోవర్ల డిజైన్లను విద్యార్థుల నుంచి కోరుతున్నట్లు ఇస్రో ప్రకటించింది. తుది ఆన్సైట్ పోటీని వచ్చే ఏడాది ఏప్రిల్లో నిర్వహించే అవకాశం ఉంది. అంతరిక్ష పరిశోధనలు భవిష్యత్ లో కొత్త పుంతలు తొక్కనున్నాయి. ఎవరూ ఊహించని విజయాలను ఇస్రో సాధించే అవకాశం ఉంది. విజయవంతంగా ల్యాండర్ నుంచి చంద్రునిపై దింపిన తర్వాత తదుపరి దశల వారీగా మనుషుల్ని పంపేందుకు సన్నాహాలు చేయనుంది. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష పరిశోధనలు చేసే సంస్థగా ఇస్రో గుర్తింపు పొందింది. అంతే కాకుండా.. అత్యంత సమర్థమైన సంస్థగా కూడా పేరు తెచ్చుకుంది.

## లోయలో పడిన బస్సు 36 మంది మృతి


**జయభేరి, శ్రీనగర్, నవంబర్ 15 :**

జమ్ముకశ్మీర్లోని దొడ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. అస్సర్ ప్రాంతంలో బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో 36 మంది ప్రాణాలు కోల్పోయినట్టు ప్రస్తుత సమాచారం. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కిష్త్వర్ నుంచి జమ్ముకి వెళ్తుండగా మార్గ మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. గాయపడ్డ వారిని స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు ట్వీట్ చేశారు. దొడ జిల్లా కమిషనర్తో ఎప్పటికప్పుడు పరిస్థితులపై ఆరా తీస్తున్నట్టు వెల్లడించారు. గాయపడ్డ వారిని తరలించేందుకు హెలికాప్టర్ ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. జమ్ముకి వస్తున్న దారిలోనే బస్ స్కిడ్ అయ్యి లోయలో పడిపోయింది. ఇప్పటికే అధికారులు రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టారు. కొంత మందిని రక్షించారు. మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. "జిల్లా అధికారులతో ఇప్పుడే మాట్లాడాను. బస్సు ప్రమాదంపై ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకుంటున్నాను. గాయపడ్డ వాళ్లను హాస్పిటల్కి తీసుకెళ్తున్నారు. వీళ్లను తరలించేందుకు హెలికాప్టర్ సర్వీస్ అందుబాటులో ఉంచుతాం.

జయభేరి సినిమా



# రామ్‌చరణ్ సినిమాలో సాయిపల్లవి..




రామ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ 'గేమ్‌ఛేంజర్' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. శంకర్ 'భారతీయుడు 2' కారణంగా ఈ సినిమా విడుదల ఆలస్యమవుతుందని అభిమానుల్లో చర్చ నడుస్తున్నది. 'గేమ్‌ఛేంజర్' సమ్మర్‌లో విడుదల చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలావుంటే.. రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇందులో కథానాయికగా ముందు మృణాళ్ పేరు వినపడింది. ఆ తర్వాత జాన్వికపూర్ పేరు లైన్లోకొచ్చింది. ఇప్పుడు వీళ్లిద్దరూ కాదు సాయిపల్లవి అని కొత్త వార్త మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. రూరల్ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్‌డ్రామాలో కథానాయికగా సాయిపల్లవి అయితేనే కరెక్ట్‌గా ఉంటుందని బుచ్చిబాబు భావించాడట. సాయిపల్లవి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. త్వరలోనే చిత్రీకరణ మొదలుకానున్న ఈ సినిమాలో విజయసేతుపతి కీలక భూమిక పోషిస్తున్నారు. మైత్రీమూవీమేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బానర్లపై నిర్మించనున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకుడు.



# కోటబొమ్మాళి.. శివాని రాజశేఖర్

'ఆర్టికల్ 15' సినిమాలో ట్రైబల్ అమ్మాయిగా నటించాను. ఇందులోనూ అదే తరహా పాత్ర కావడంతో దర్శకుడు తేజ నన్ను సంప్రదించారు. ఈ సినిమా కోసం శ్రీకాకుళం స్లాంగ్ నేర్చుకున్నాను.' అని శివాని రాజశేఖర్ అన్నారు. రాహుల్ విజయ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రం 'కోటబొమ్మాళి పీఎస్'. శ్రీకాంత్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలకపాత్రధారులు. తేజా మార్ని దర్శకుడు. గీతాఆర్ట్స్2 పతాకంపై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా శివానీ బుధవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నాది విలేజ్ కానిస్టేబుల్ పాత్ర. ఈ పాత్ర కోసం నాన్న కొన్ని సూచనలు చేశారు. మాతృక 'నాయట్టు'లో చేసినవారి ప్రభావం పడకుండా, నా స్టైల్‌లో నేను చేశాను.' అని చెప్పింది శివాని. సినిమా విడుదలకు ముందే 'లింగిడి' సాంగ్ మాకు మంచి గుర్తింపు తెచ్చిందని, ఈ పాట వల్లే 'కోటబొమ్మాళి'కి ఇంత బజ్ వచ్చిందని, ఈ సందర్భంగా సంగీత దర్శకుడు మిథున్ ముకుందన్‌కి థ్యాంక్స్ అని శివాని ఆనందం వ్యక్తం చేశారు.

# ఆ పాత్ర మేకప్ కోసమే రెండు గంటలు పట్టేది



'సార్.. ఒక సినిమా ఇవ్వండి.. ఒక్కఛాన్స్ ప్లీజ్.. అంటూ అజయ్‌భూపతి వెంటపడ్డాను. చిన్న చిన్న పాత్రలకు నిన్ను తీసుకోలేనని, మంచి పాత్ర వస్తే తప్పకుండా ఫోన్‌చేస్తానని మాట ఇచ్చారు. నటిగా నా పొటెన్షియల్, నా ట్యాలెంట్ ఆయనకు బాగా తెలుసు. సరైన కథ దొరికింది. దానికి తగ్గట్టు మంచి పాత్ర కుదిరింది. వెంటనే నాకు ఫోన్ వచ్చింది. ఈ సినిమా నా కెరీర్‌కే పెద్ద టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్మకంతోవున్నాను' అని పాయల్ రాజ్‌పుత్ అన్నారు. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మంగళవారం'. అజ్మల్ అమీర్ కథానాయకుడు. అజయ్‌భూపతి దర్శకుడు. ఎం.సురేశ్‌వర్మ, స్వాతిరెడ్డి గునుపాటి నిర్మాతలు. ఈ నెల 17న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా పాయల్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇండియాలో ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదు. నేను చేసిన శైలూ తరహా పాత్ర కూడా ఎవ్వరూ టచ్ చేయలేదు. కథపరంగా ఇది సున్నితమైన పాయింట్. నా పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయ్. సినిమా చూశాక శైలూపై మీకు సింపతీ వస్తుంది' అని పాయల్ అన్నారు. నిజజీవితంలో అస్సలు సంబంధంలేని పాత్రను ఇందులో చేశానని, శైలు పాత్ర గెటప్‌కే రెండుగంటలు పట్టేదని, అలాగే ఆ పాత్ర నుంచి బయటకు రావడానికి ఎక్కువ సమయం పట్టేదని, పదిహేనురోజులపాటు పాత్ర నుంచి బయటకి రాలేకపోయానని పాయల్ చెప్పారు. రాజీపడని నిర్మాతలు, టాలెంటెడ్ టెక్నీషియన్స్ పనిచేసిన ఈ సినిమా తప్పకుండా ఘన విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా ఆమె నమ్మకం వెలిబుచ్చారు.




# వాస్తవ సంఘటనల ఆధారంగా

1989లో చిత్తూరుజిల్లా కుప్పం నేపథ్యంలో సాగే కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం 'హరోం హర'. సుధీర్‌బాబు, మాళవికశర్మ జంటగా, జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి.నాయుడు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర కథానాయిక మాళవికశర్మ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. చీరలో అందంగా, సాంప్రదాయబద్ధంగా కార్తికేయుని సన్నిధిలో నిలబడివున్న మాళవికశర్మ స్టిల్ ఆకట్టుకునేలా ఉంది. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతున్నదని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్.

# మిస్టీరియస్ దూత..

సాగర్ ఓ సక్సెస్‌ఫుల్ జర్నలిస్ట్. ఊహించని సంఘటనలు, మిస్టీరియస్ మరణాలు, అతీంద్రియ సంఘటనలు తననీ తన కుటుంబాన్ని వేధిస్తుంటాయి. ఆ తర్వాత ఏమైంది? అనే ప్రశ్నకు సమాధానంగా రూపొందిన ఎనిమిది ఎపిసోడ్ల వెబ్ సీరీస్ 'దూత'. అక్కినేని నాగచైతన్య టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవాని శంకర్, ప్రాచీ దేశాయ్ ఇతర పాత్రధారులు. విక్రమ్ కె.కుమార్ దర్శకుడు. శరత్‌మరార్ నిర్మాత. డిసెంబర్ 1 నుంచి ఈ సిరీస్ ప్రసారం కానుంది. ఉత్కంఠను కలిగించే సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదని, నాగచైతన్య, ప్రియా భవాని శంకర్, ప్రాచీ దేశాయ్ ప్రాణంపెట్టి చేశారని ప్రైమ్ వీడియో అపర్ణ పురోహిత్ అన్నారు. అంకితభావం, అవిశ్రాంత ప్రయత్నాల ఫలితం ఈ 'దూత' వెబ్‌సిరీస్ అని, విక్రమ్ కె.కుమార్ అద్భుతంగా తెరకెక్కించాడని, మంచి నటీనటులు, సాంకేతికనిపుణులు పనిచేసిన ఈ సిరీస్ తప్పక ఆదరణ పొందుతుందని నిర్మాత శరత్ మరార్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మీకోలజ్ సైగులు, సంగీతం: ఇషాన్ చాబ్రా.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com